ఆనందం.. ఆందోళన

- మధ్యమానేరులో ముంపునకు గురై ఇళ్లు నిర్మించుకున్న నిర్వాసితులకు ఇందిరమ్మ పథకం వర్తించేనా ?
- ఇల్లు లేని 4,696 మందికి మంజూరు
- కాలనీల్లో నిర్మించినవి 5,987
- తమకూ పథకం వర్తింపజేయాలని విజ్ఞప్తి



కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించుకున్న ఇళ్లు

బోయినపల్లి: మధ్యమానేరు ప్రాజెక్టులో ముంపునకు గురై ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న నిర్వాసితులు తమకు ఇందిరమ్మ పథకం వర్తిస్తుందా లేదా అనే ఆలోచనలో ఉన్నారు. ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకోని వారికే అని ప్రకటించడంతో ఇళ్లు నిర్మించుకున్న వారిలో ఆందోళన మొదలైంది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు రూ.5.04 లక్షలు ఇస్తామని మాజీ సీఎం కేసీఆర్ 2016లో వేములవాడలో ప్రకటించి, హామీ అమలు సాధ్యం కాదని చెప్పిన విషయం తెలిసిందే. ఈనెల 20న సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో మిడ్‌మానేరు నిర్వాసితులకు 4,696 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు జీవో జారీచేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల చొప్పున రూ. 236.80 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. కాగా ఇప్పటి వరకు ఇల్లు నిర్మించని వారికి మాత్రమేనని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో 10,683మంది పీడీఎఫ్‌లను గతంలో గుర్తించారు.

ఇళ్లు నిర్మించుకున్న వారు 5,987 మంది

మధ్యమానేరు ప్రాజెక్టు నిర్మాణంలో కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, సంకెపెల్లి, శాభాష్‌పల్లి, రుద్రవరం, అనుపురం కొడుముంజ, చీర్లవంచ, చింతలఠాణా, గుర్రంవానిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈ గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు ఏర్పాటు చేసి ఒక్కో నిర్వాసితుడికి 242 చదరపు గజాల ఇంటిస్థలం ఇచ్చారు. కాగా 2016, 2017లోనే మెజార్టీ నిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలి ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్నారు. ఇప్పటికే 5,987 మంది ఇళ్లు నిర్మించుకోగా తమకు సైతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసి రూ. 5 లక్షలు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు. మరో రూ.250 కోట్లవరకు మంజూరుచేస్తే వీరికిమేలు జరుగుతుందంటున్నారు.

ఏళ్ల తరబడి పోరాటం

మాజీ సీఎం కేసీఆర్ నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షలు ఇస్తామని చెప్పి, మాట తప్పారని ముంపు గ్రామాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షల ప్రధాన డిమాండ్‌తో గతంలో మహాధర్నాలు, సడక్ బంద్, వంటవార్పు, నిరసనలతో పాటు ఆమరణ దీక్ష సైతం చేపట్టారు. వీరికి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం మద్దతు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం ఇల్లు నిర్మించుకోని వారికి ఇందిరమ్మ పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కాగా ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా సీఎం రేవంత్‌రెడ్డి రూ. 5లక్షలు మంజూరుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో బ్యాంకు రుణాలు, ఫైనాన్స్‌ల్లో రుణాలు, అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నట్లు చెబుతున్నారు. పలువురు నిర్వాసితులు అప్పులు చెల్లించలేక నిర్మించిన ఇళ్లను విక్రయించిన దాఖలాలున్నాయి. స్థానిక కాంగ్రెస్ నాయకులు సైతం అందరికీ ఇందిరమ్మ పథకం వర్తించేలా చూడాలని కోరుతున్నట్లు తెలిసింది. కుటుంబ, యువతీ, యువకుల తదితర పెండింగ్ పరిహారాలకు సీఎం పర్యటనలో మోక్షం లభిస్తుందని భావిస్తున్నారు.

ఇళ్లు నిర్మించుకున్న వారికి వర్తింపజేయాలి



ఇళ్లు నిర్మించుకోని నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. గతంలో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న వారికి సైతం ఇందిరమ్మ పథకం వర్తింపజేసి రూ.5 లక్షలు ఇవ్వాలి. మేం వరదవెల్లిలో ఇల్లు నిర్మించుకున్నాం. ఇందిరమ్మ ఇంటి సాయం అందుతుందని అనుకుంటున్నాం.

– జక్కని సత్యనారాయణ, వరదవెల్లి

రుణభారం తగ్గుతుంది



ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నా. కొదురుపాకలో ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులో రుణం తీసుకున్నా. మాకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేయాలి. వచ్చే డబ్బులతో బ్యాంకులో చెల్లిస్తే కొంతమేర రుణభారం తగ్గుతుంది. ప్రభుత్వం ఇల్లు నిర్మించుకున్న వారికి సైతం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి రూ. 5 లక్షలు అందించాలి.

– బాలగోని తిరుపతి, కొదురుపాక

పాలిస్టర్ వస్త్రాలతో కేన్సర్ ముప్పు

- కాటన్ వస్త్రోత్పత్తిదారుల జేఏసీ



మాట్లాడుతున్న కాటన్ వస్త్రోత్పత్తిదారుల జేఏసీ ప్రతినిధులు

సిరిసిల్ల: పాలిస్టర్ వస్త్రాలతో కేన్సర్ ముప్పు పొంచి ఉందని, స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసే యూనిఫామ్స్‌ను పాలిస్టర్ బట్టతో తయారు చేయించాలని చూస్తున్నారని సిరిసిల్ల కాటన్ జేఏసీ ప్రతినిధులు ఆరోపించారు. సిరిసిల్లలో సోమవారం జేఏసీ ప్రతినిధులు గౌడ వాసు, ఆడెపు రవీందర్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో స్కూల్ విద్యార్థులకు ఇచ్చిన యూనిఫామ్స్ వెలిసిపోయాయని గుర్తించారని, వాటి స్థానంలో 50శాతం కాటన్, 50శాతం పాలిస్టర్‌తో కూడిన వస్త్రాలు అందించారని గౌడ వాసు వివరించారు. పాలిస్టర్ వస్త్రాలతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్‌కు పునాదులైన పిల్లలకు ప్రమాదకరమైన వస్త్రాలను, నాణ్యతలేని వస్త్రాలను అందించవద్దని ఆయన కోరారు. సిరిసిల్లలో నాణ్యమైన వస్త్రాల తయారీ కాటన్ నూలు సాధ్యమవుతుందని, ఇది అనాదిగా వస్తుందని ఆడెపు రవీందర్ వివరించారు. 66 లక్షల ఆర్‌వీఎం వస్త్రాల తయారీ ఆర్డర్లను పాలిస్టర్ కాకుండా కాటన్ నూలుతో కూడిన వస్త్రాల ఆర్డర్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు గాజుల రవి, కల్యాడపు మనోహర్, శివరాత్రి నటరాజ్, సాప రఘుపతి, వేముల భూమేశ్వర్, గాలి సత్యనారాయణ, మేర్గు రమేశ్, మార్గం సంతోష్, ఎక్కల్‌దేవి శ్రీనివాస్, గాజుల శంకర్, ఆడెపు సదానందం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వేములవాడ మండలం వట్టెంలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా రూరల్ ఇన్‌చార్జి ముష్కం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ గౌడ్, పొన్నం సత్యం, కొట్టె గంగాసాగర్, గుడిసె రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న చిరంజీవి

సిరిసిల్ల: పట్టణంలో ఇటీవల బైరి అమర్, ప్రవంతి ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబానికి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం శాలపల్లికి చెందిన జెడల చిరంజీవి సోమవారం రూ. 29,300 ఆర్థికసాయంగా అందించారు. ఇక్కడ పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, సంఘం నాయకులు దిడ్డి మాధవి ఉన్నారు.

ఇల్లంతకుంటలో 89 శాతం సర్వే పూర్తి



రామాజీపేటలో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో శశికళ

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలంలో 89 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయినట్టు ఎంపీడీవో శశికళ తెలిపారు. మండలంలో సోమవారం నాటికి పత్తికుంటపల్లి, ఆరేపల్లి, గూడెపుపల్లి, కిష్టా రావుపల్లి, గ్రామాల్లో సర్వే పూర్తయినట్టు ఆమె పేర్కొన్నారు. మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో 127 మంది ఎన్యుమరేటర్లు, 14 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు ఆమె తెలిపారు. కాగా వెంకట్రావుపల్లి గ్రామంలో ప్రజలు సర్వేను బహిష్కరిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

● విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

సిరిసిల్ల: సమాజంలో అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ ప్రతినిధులు జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. బీసీ ఎస్సీ, ఎస్టీ ఈబీసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజలందరికీ ఉపాధి కల్పించాలని, అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యం ఉన్న ఎకరం భూమిని ఇవ్వాలన్నారు. అర్హులైన వారందరికీ 200 వందల గజాల స్థలం, నాలుగు గదులు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువేలు శ్రీకాంత్, జిల్లా కన్వీనర్ ఎడపెల్లి బాబు, కో కన్వీనర్స్ ఉల్లెందుల అరుణ్, కేసుగాని పరమేశ్వరి, బడే అమర్, భీమ్ ప్రకాశ్, భీమ్ కీర్తన, కుర్మ సురేశ్, కుడుకల మధు, రామంచ పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

● దళితులకు భూమి కేటాయించాలి

కోనరావుపేట: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన దళిత మహిళలకు ప్రభుత్వం జీవనోపాధి కోసం భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామానికి చెందిన మహిళలు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. 1970–80లో 10 గుంటల భూమిని కేటాయించారు. గత ప్రభుత్వంలో కొంతమందికి 3 ఎకరాల భూమి అందించినా తమకు ఎలాంటి సాయం అందలేదన్నారు. తమకు కొంత భూమిని గ్రామంలో కేటాయించాలని బడే సుహాసిని, దుబ్బాక లక్ష్మి, లింగంపెల్లి లత, రాజవ్వ, సునీత, మల్లీశ్వరి, శ్రీలత తదితరులు కోరారు.

● కుక్కలు, కోతుల బెడదను నివారించాలి

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో కొన్నినెలలుగా కోతుల బెడద ఎక్కువైందని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో తిరుగుతున్న కోతులు, కుక్కలు మహిళలు, చిన్నారులు, వృద్ధులపై దాడి చేస్తున్నాయన్నారు. వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

● నిధుల మంజూరుపై హర్షం

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై హర్షం వ్యక్తంచేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాజన్న ఆలయ ఉద్యోగుల యూనియన్ టీఎస్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

● శిలాఫలకం ఏర్పాటుకు సిద్ధం

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు రూ.76 కోట్లకు గాను ఆలయంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. వేములవాడ రాజన్న ఆలయానికి ఈ నెల 20న వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ముందుగా స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం స్వామివారి ఆలయ అభివృద్ధికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆలయంలోని కోటిలింగాలు, నాగిరెడ్డి మండపానికి మధ్యలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని అవిష్కరించనున్నట్లు అలయ అధికారులు తెలిపారు. అనంతరం రాజన్న గుడి చెరువులో పార్కింగ్ స్థలంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించి సభలో పాల్గొంటారు.

● రోడ్డు మరమ్మతు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డులో దేశాయిపల్లి వరదకాల్వ పరిసరాల్లోని కల్వర్టు వద్ద చెడిపోయిన రోడ్డుపై ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మట్టిపోసి సోమవారం చదును చేశారు. రోడ్డు గుంతల మయం కావడంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని ఇటీవల మండలానికి వచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సురేందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు తెలిపారు. ఏఈ నవ్య ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులు చేశారు.

● బాధ్యతలు స్వీకరణ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ కేంద్రానికి నూతనంగా పిల్లల వైద్యుడి పోస్టు మంజూరు కాగా, సోమవారం వైద్యులు హోంకార్ బాధ్యతలు చేపట్టారు.సీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యులు బాబును కలిసి హోంకార్ విధుల్లో చేరారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలందిస్తానన్నారు.

● అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దు

ఇల్లంతకుంట : అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలించవద్దని తహసీల్దార్ ఎంఎ ఫారూక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్ల ఓనర్లతో సమావేశం నిర్వహించారు. ట్రాక్టర్లను ఓవర్‌స్పీడ్‌తో నడపవద్దని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ గౌడ్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● వృద్ధాశ్రమానికి విరాళం

బోయినపల్లి: గోదావరిఖని పట్టణంలో సామాజిక కార్యకర్త పీటీ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ వృద్ధాశ్రమానికి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈవో చెన్నమాధవుని లక్ష్మి రామరాజు దంపతులు సోమవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పీటీ స్వామి తదితరులు రామరాజు దంపతులను సన్మానించారు.

● ఆర్థికసాయం అందజేత

ఎల్లారెడ్డిపేట: వీర్నపల్లి మండలకేంద్రానికి చెందిన పిట్ల మోహన్ ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన ఎన్నారై రాధారపు సత్యం పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. మోహన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఎన్నారై సత్యం తనవంతుగా రూ.15వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఆయన వెంట తిరుపతి, తదితరులున్నారు.

క్లుప్తంగా

దళితులను వంచించిన బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

సిరిసిల్ల: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో దళితులను వంచించారని, దళిత సంఘాలపై ఆంక్షలు విధించారని జిల్లా దళిత సంఘాల నాయకుడు కత్తెర దేవదాస్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో ఆయన దళిత సంఘాల ప్రతినిధులతో కలిసి సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల మానేరు తీరంలో కరకట్టకు దళితులకు చెందిన 150 ఎకరాల భూములను లాక్కుని పైసా పరిహారం ఇవ్వలేదన్నారు. సిరిసిల్లకు మంత్రి హోదాలో కేటీఆర్ వస్తే దళిత నాయకులను నిర్బంధించారని గుర్తు చేశారు. పదేళ్లు రాష్ట్రాన్ని వనరులను దోపిడీ చేసిన బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ పాలనను తప్పు పట్టడం అంటే దయ్యాలు వేదాలను వల్లించినట్లు ఉందన్నారు. ఇకపై దళిత నాయకులు తప్పుడు కూతలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో దళిత నాయకులు నేవూరి లక్ష్మణ్, రాము, కౌన్సిలర్లు కుడిక్యాల రవికుమార్, వేముల రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోనె ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ

సిరిసిల్ల ఎడ్యుకేషన్: మెదక్ జిల్లాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళా శాల ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ జోనల్ మీట్ క్రీడా పోటీల్లో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ పద్మా దర్శనాల తెలిపారు. అండర్ 14 విభాగంలో ఖో-ఖో ప్రథమ స్థానం అండర్ 17 విభాగంలో, బ్యాడ్మింటన్ జట్టు ప్రథమ స్థానం, అండర్ 19 విభాగంలో బ్యాడ్మింటన్ జట్టు ప్రథమ స్థానం, హ్యాండ్‌బాల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అథ్లెటిక్స్ అండర్ 17 విభాగంలో రుషిత (హైజంప్)గోల్డ్ మెడల్, డిస్కస్ త్రో పి. శరణ్య సిల్వర్ మెడల్, 3 కే రన్ సుచరిత సిల్వర్ మెడల్ కైవసం చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ పద్మ దర్శనాల, వైస్ ప్రిన్సిపల్ రమ్యకృష్ణ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వింధ్యమాలతి, పీడీ అలేఖ్య, పీఈటీ జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వేములవాడ రూరల్ ఏవోగా వినీత



ఏవో వినీత

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల వ్యవసాయ అధికారిగా వినీత బాధ్యతలు చేపటారు. ఇప్పటివరకు అర్బన్, రూరల్ ఏవోగా ఒక్కరే ఉన్నారు. రామడుగు మండలం వెదిరె నుంచి వచ్చినట్లు తెలిసింది.

'గోరుముద్ద' ప్రారంభం



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న హెచ్‌ఎం, ఆంజనేయులుగౌడ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వైద్యుడు కొండ ఆంజనేయులుగౌడ్ సహకారంతో గోరుముద్ద కార్యక్రమాన్ని సోమవారం ప్రధానోపాధ్యాయుడు పాక మురళీధర్ ప్రారంభించారు. అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలకు తరలిరావాలి



బోయినపల్లి: జిల్లాకేంద్రంలో ఈనెల 19న జరిగే సీపీఎం మూడవ జిల్లా మహాసభలకు కార్మికులు తరలిరావాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని కొదురుపాక హమాలీలను సోమవారం కలిసి మాట్లాడారు. కార్మికులు జిల్లా మహాసభల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కుడుదుల అంజయ్య, రాగుల సంపత్, ఎడ్ల ప్రవీణ్, మల్లేశం, నాగరాజు, లచ్చయ్య తదితరులు ఉన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారంకు చెందిన యాసరవేని సాయి (25), గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌కు చెందిన తాటికొండ నీరజ (22) సోమవారం వేములవాడలోని బద్దిపోచమ్మ ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమ విషయం పెద్దల దృష్టికి తీసుకెళ్లగా పెళ్లికి నిరాకరించారు. దీంతో ప్రేమ వివాహం చేసుకున్న జంట తమకు రక్షణ కల్పించాలని ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్‌ను ఆశ్రయించారు. దీంతో ఎస్సై సాయి తల్లిదండ్రులు దేవయ్య- రాజమణితో పాటు నీరజ పెద్దబాపు సంపత్, నడిపి బాపు మారుతిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.



ముస్తాబాద్ మండలంలోని గూడెంలో ఇరవై ఏళ్ల క్రితం నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోనే పగుళ్ల బారిన వాటర్ ట్యాంక్ ఉంది. నిత్యం ట్యాంక్ పెచ్చులూడుతూ కిందపడుతున్నాయి. ప్రమాదం జరగక ముందే శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌ను తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
దివ్య, మిషన్ భగీరథ, ఏఈ, సెల్ నెంబర్ 9618151767

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

రైతులు వరికొయ్యలు కాల్చొద్దు



చందుర్తి : మల్యాలలో రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి దుర్గరాజు



వీర్నపల్లి: రైతులతో మాట్లాడుతున్న ఫజిల్

చందుర్తి: వరి కొయ్యలు కాలిస్తే వాతావరణ కాలుష్యం పెరిగి, భూసారం కోల్పోతుందని వ్యవసాయాధికారి దుర్గరాజు తెలిపారు. మండలంలోని మల్యాల, మర్రిగడ్డ, తిమ్మాపూర్, చందుర్తి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో సోమవారం పర్యటించారు. రైతులతో మాట్లాడుతూ వరికొయ్యలు కలియ దున్నటంతో దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాలు గడించవచ్చని తెలిపారు.

బోయినపల్లి: పంట కోసిన రైతులు వరి కొయ్యలు కాల్చొద్దని ఎంఏవో కే.ప్రణీత అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో పంటల నమోదులో భాగంగా వరి కోతలు పూర్తి చేసిన చేలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చితే కలిగే నష్టాల గూర్చి వివరించారు. వరి కొయ్యలకు నిప్పు పెడితే భూసారం దెబ్బతినడంతో పాటు, పంటల దిగుబడి తగ్గుతుందని తెలిపారు. ఏఈవోరవళి, రైతులు ఉన్నారు.

వీర్నపల్లి: రైతులు పంటకోసిన తర్వాత వరికొయ్యలు కాల్చొద్దని వ్యవసాయ విస్తరణ అధికారి ఫజిల్ అన్నారు. సోమవారం మండలంలోని గర్జనపల్లి రైతువేదిక ఆవరణలో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు వరికొయ్యలను నేలలో కలియదున్నితేనే ప్రయోజనకరమని, దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఉద్యోగాలకు ఎంపిక



సింధు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన పొన్నం పద్మ-ఎల్లయ్య దంపతుల కూతురు సింధు కష్టపడి చదివి గ్రూప్ ఫోర్‌తో పాటు బ్యాంక్ ఉద్యోగం సాధించింది. తల్లిదండ్రులు కష్టపడి చదివించగా పట్టుదలతో చదివి రెండు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు.


నియామకం



నియామకపత్రం అందుకుంటున్న హరి

కోనరావుపేట: రాష్ట్ర పద్మశాలీ సంఘం కార్యనిర్వాహక సభ్యుడిగా మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన గాజుల హరిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందజేశారు. గాజుల హరి జిల్లాలో పద్మశాలీ సంఘంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రస్తుతం జిల్లా పద్మశాలీ సంఘం ప్రచార కార్యదర్శిగా, కోనరావుపేట మండల ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రాజకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

ముస్తాబాద్: మండలంలోని గూడెం శివారులోని కొండపై సత్య నారాయణస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ఈమేరకు గూడెం గౌడ సంఘం రూ.51వేలను ఆలయ నిర్మాణ కమిటీకి సోమవారం అందజేసింది. అలాగే మున్నూరుకాపు సంఘం-03 రూ.21వేలు, కిరాణ వర్తక సంఘం రూ. 5వేలను అందించారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి



వీర్నపల్లి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జేఎన్‌టీయూ విద్యార్థి నేత ఎరవెల్లి జగన్ అన్నారు. మండలంలోని గర్జనపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్ జేఎన్‌టీయూ యూనివర్సిటీ అందించిన నోట్ పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంగల శ్రీనివాస్, భూక్య గజన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమారి, మహేశ్వరి, రమ్య, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ రాకేశ్ గౌడ్, అడ్వకేట్ గజ్జెల ప్రశాంత్, దేవేందర్, శంకర్, సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

చందుర్తి: పట్టణంలో ఈనెల 20న తలపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభను మండలప్రజలు విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టే ప్రభాకర్, మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామిలు కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బహిరంగ సభకు మండలంలోని అన్నిగ్రామాలనుంచి ప్రజలు తరలిరావాలని కోరారు.

ఎల్లారెడ్డిపేట: ఈనెల 20న వేములవాడలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని రేవంత్ మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు గూడ విజయ్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. వేములవాడ దేవస్థానంతో పాటు పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారన్నారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభలో పాల్గొనాలని కోరారు.